సాక్షి
సంగారెడ్డి
బుధవారం । 28 । మే । 2025



సర్కారు బడి పిలుస్తోంది

కార్పొరేట్, ప్రైవేట్ స్కూళ్లకు దీటుగా పేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్యను సర్కారు బడులు అందిస్తున్నాయి. వివరాలు 8లో ▸



ధాన్యం కుప్పల్ని ఢీకొని..

రోడ్డుపై వేసిన ధాన్యం కుప్పల్ని ఢీకొని ఇద్దరు ద్విచక్రవాహనదారులు దుర్మరణం పాలయ్యారు. వివరాలు 8లో ▸



ఇష్టారాజ్యంగా మట్టి తవ్వకాలు

హత్నూర మండలం సికిందలాపూర్ శివారులో మట్టి తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

అందుబాటులోనే సరిపడా విత్తనాలు

జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శివప్రసాద్



సమావేశంలో పాల్గొన్న జిల్లా అధికారులు

సంగారెడ్డి టౌన్: రాబోయే వర్షాకాలంలో రైతులకు సరిపడా విత్తనాలు అందుబాటులోనే ఉన్నాయని ఈ మేరకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శివప్రసాద్ పేర్కొన్నారు. సంగారెడ్డి మండలంలోని రైతు వేదిక నుంచి మంగళవారం 'రైతు నేస్తం' కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...జిల్లాలో జీలుగా, జనుము విత్తనాల కొరత లేదని పేర్కొన్నారు. పంటలపై రైతులకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. రైతులు అధికారుల సలహాలు, సూచనలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

మునిపల్లి(అందోల్): లింగంపల్లి గురుకుల పాఠశాల, కళాశాలలో 5వ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు విద్యా బోధనకు అతిథి అధ్యాపక పోస్టులు ఖాళీలున్నాయని ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 31లోగా దరఖాస్తు చేసుకోవచ్చని ప్రిన్సిపాల్ సురభి చైతన్య మంగళవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. తెలుగు 2, హిందీ, ఇంగ్లిష్ 2, మ్యాథ్స్, బయోసైన్స్, ఫిజికల్ సైన్స్, సోషల్ స్టడీస్, స్కూల్‌లో బోధనకు పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు.

కేపీఎస్‌తోనే కార్మికుల సంక్షేమం

కేపీఎస్ అధ్యక్షుడు చంద్రశేఖర్

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): కార్మికుల సంక్షేమం,అభివృద్ధి కార్మిక పోరాట సమితి(కేపీఎస్)తోనే సాధ్యమని ఆ సంఘం అధ్యక్షుడు కొత్తగొల్ల చంద్రశేఖర్ పేర్కొన్నారు. మండలంలోని ఎంఆర్‌ఎఫ్ పరిశ్రమ వద్ద మంగళవారం నిర్వహించిన గేట్ మీటింగ్ సమావేశానికి హాజరై కార్మికులనుద్దేశించి మాట్లాడుతూ... కార్మికులకు చట్టబద్ధమైన ఉద్యోగ భద్రత, స్వేచ్ఛ కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. ఈనెల 28న జరిగే యూనియన్ ఎన్నికల్లో పులి గుర్తుకు ఓటేసి కేపీఎస్ యూనియన్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కార్మికులకు విజ్ఞప్తి చేశారు. కార్మికులకు నిత్యం అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారు. మెరుగైన మెడికల్ పాలసీని అమలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, విఠల్, కిరణ్, కార్మికులు పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీని గెలిపించాలి

జహీరాబాద్: మహీంద్ర అండ్ మహీంద్ర కర్మాగారంలో త్వరలో జరగనున్న కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీని భారీ మెజార్టీతో గెలిపించాలని సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ ఎస్.గిరిధర్‌రెడ్డి కార్మికులను కోరారు. సీఐటీయూ కార్మిక సంఘానికి చెందిన 25 మంది కార్మికులకు కండువాలు కప్పి ఐఎన్‌టీయూసీ యూనియన్‌లో చేర్చుకున్నారు. అనంతరం తన క్యాంపు కార్యాలయం వద్ద మంగళవారం నిర్వహించిన సమావేశంలో గిరిధర్‌రెడ్డి మాట్లాడుతూ.. మహీంద్రలో జరగనున్న కార్మిక సంఘం ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీని బలపరిస్తే కార్మికులకు మంచి వేతన ఒప్పందం ఇప్పించేలా కృషిచేస్తామన్నారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి, సీడీసీ చైర్మన్ ముబీన్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పి.నర్సింహారెడ్డి, మహీంద్ర కర్మాగారం ఐఎన్‌టీయూసీ నాయకులు శివకుమార్, అశోక్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, సంపత్, కార్మికులు పాల్గొన్నారు.

డీఎస్‌ఆర్ యాప్‌ను ఉపసంహరించుకోవాలి

కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు నర్సింహులు

నారాయణఖేడ్: ప్రభుత్వం పంచాయతీ కార్యదర్శుల కోసం తీసుకొచ్చిన డీఎస్‌ఆర్ యాప్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కొరారి నర్సింహులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సంఘనాయకులతో కలిసి మంగళవారం ఖేడ్ ఇన్‌చార్జి తహసీల్దార్ రాజుపటేల్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంచాయతీ కార్యాలయానికి వచ్చిన తర్వాతే ఇతర పనులు పెట్టుకోవాలని, థంబ్ వేసి యాప్ సహాయంతో ఇంటింటికీ తిరిగి చెత్త కొలతలు తీయాలని ప్రభుత్వం నిర్దేశించిందన్నారు. కార్యదర్శులకు ఇప్పటికే రేషన్ కార్డులు, గృహనిర్మాణం, ఉపాధిహామీ, పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా తదితర పనులకోసం ఆయాశాఖల కార్యాలయాలకు తిరుగుతూ గ్రామాల్లో పర్యవేక్షణ పనులు భారంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. వినతిపత్రం అందజేసినవారిలో నాయకులు రఘు, బస్వరాజ్, రమేశ్ ఉన్నారు.



శనీశ్వర ఉత్సవాల్లో పాల్గొన్న ప్రభుత్వ సలహాదారు కేశవరావు తదితరులు

ఘనంగా శని జయంతి ఉత్సవాలు

హాజరైన ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు

ఝరాసంగం(జహీరాబాద్): జిల్లాలో ఆధ్యాత్మిక క్షేత్రంగా భాసిల్లుతున్న బర్దీపూర్ శ్రీ దత్తగిరి మహారాజ్ ఆశ్రమ ఆవరణలోని శనీశ్వరుడి జయంతి ఉత్సవ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఆశ్రమ పీఠాధిపతులు వైరాగ్య శిఖామణి అవధూత గిరి మహారాజ్, డాక్టర్ సిద్ధేశ్వర స్వామి ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు, జహీరాబాద్ సివిల్ కోర్టు జడ్జి గంటా కవిత, ఎమ్మెల్యే సంజీవరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు హన్మంత్‌రావు పాటిల్ తదితరులు హాజరై ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.



క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు



గర్భగుడిలోని పార్వతీపరమేశ్వరులు

కేతకీలో అమావాస్య సందడి

- ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే, ప్రజలు
- భారీగా తరలి వచ్చిన భక్తజనం

ఝరాసంగం(జహీరాబాద్): కేతకీ సంగమేశ్వరాలయంలో భక్తులతో అమావాస్య సందడి నెలకొంది. మంగళవారం అమావాస్యను పురస్కరించుకుని తెలుగు రాష్ట్రాలతోపాటు కర్ణాటక, మహారాష్ట్రలలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయ ఆవరణలోని అమృతగుండంలో పవిత్ర పుణ్య స్నానాలు ఆచరించి, గుండంలోని జలలింగానికి పూజలు చేశారు. అనంతరం గంటల తరబడి క్యూలైన్లలో వేచి ఉండి, పార్వతి పరమేశ్వరులను దర్శించుకున్నారు. అనంతరం ఆలయ అర్చకులు స్వామి వారి తీర్థ ప్రసాదాలను అందించి, ఆశీర్వదించారు. అదేవిధంగా ఆలయ ఆవరణలోని బసవణ్ణమందిరం, నాగులకట్ట, నాగేంద్రుడి ఆలయం, సుబ్రమణ్యస్వామి ఆలయం, పోగడ చెట్టు, నవగ్రహాలు, బలభీముడి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

ఎమ్మెల్యే సంజీవరెడ్డి ప్రత్యేక పూజలు

అమావాస్యను పురస్కరించుకుని కేతకీ ఆలయంలో ఎమ్మెల్యే సంజీవరెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి వచ్చిన ఆయనకు ఆలయ మర్యాదలు, పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.

స్లాట్ లేకున్నా స్పాట్ రిజిస్ట్రేషన్లు

- అత్యవసరమైన వారి కోసమే ఈ సేవలంటున్న అధికారులు
- రోజుకు ఐదు చొప్పున డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్‌కు అవకాశం



సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: స్లాట్ బుకింగ్ విధానం అమలవుతున్న సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రయోగాత్మకంగా వాక్–ఇన్ రిజిస్ట్రేషన్లకు కూడా అవకాశం కల్పించారు సదాశివపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అధికారులు. దీంతో స్లాట్ బుక్ చేసుకోని వారు కూడా వాక్ – ఇన్ రిజిస్ట్రేషన్లు చేసుకుంటున్నారు. సోమవారం మొత్తం 19 స్లాట్లు బుక్ కాగా, ఇందులో 20 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్లు జరిగాయి. ఇలా స్లాట్ బుక్ చేసుకోకుండా..వాక్ – ఇన్ పద్ధతిలో ఐదు డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్లు జరిగాయి. అలాగే గజ్వేల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కూడా వాక్–ఇన్ రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు. వివిధ రకాల స్థిరాస్తుల రిజిస్ట్రేషన్ల ప్రక్రియను మరింత సులభతరం చేసేందుకు ప్రభుత్వం కొత్తగా స్లాట్ బుకింగ్ విధానాన్ని అమలు చేస్తున్న విషయం తెలిసిందే. ప్రయోగాత్మకంగా సదాశివపేట, గజ్వేల్, సిద్దిపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల (ఎస్‌ఆర్‌ఓ)ల్లో ఈ విధానాన్ని అమలు చేస్తోంది.

తప్పిన పడిగాపులు

ఏదైనా డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలంటే సంబంధిత వ్యక్తులు ముందుగా ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. ఆ స్లాట్‌లో కేటాయించిన సమయానికి ఎస్‌ఆర్‌ఓ కార్యాలయానికి వెళ్లి రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. దీంతో రిజిస్ట్రేషన్ల కోసం ఉదయం నుంచి సాయంత్రం వరకు గంటల తరబడి కార్యాలయంలో పడిగాపులు కాయాల్సిన అవసరం ఉండదు. అలాగే ఈ రిజిస్ట్రేషన్ ఉంటే రోజంతా పనులు మానుకోవాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయి. ఈ సమస్యలకు చెక్ పెట్టేందుకు ఈ స్లాట్ బుకింగ్ విధానం అమలు చేస్తున్నారు.

వాక్ – ఇన్ రిజిస్ట్రేషన్లు అంటే..

రిజిస్ట్రేషన్ల కోసం స్లాట్ బుక్ చేసుకోని వారు ఈ వాక్ – ఇన్ విధానాన్ని వినియోగించుకోవచ్చు. ప్రతీరోజు సాయంత్రం 5 గంటల నుంచి ఆరు గంటల వరకు ఈ విధానంలో రిజిస్ట్రేషన్లు చేస్తారు. స్లాట్ బుక్ చేసుకోనివారు నేరుగా సాయంత్రం 5 గంటలకు కార్యాలయానికి వెళితే ఈ రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేస్తారు. అయితే వాక్ – ఇన్ విధానంలో రోజుకు ఐదు రిజిస్ట్రేషన్లకు మాత్రమే ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని ఆశాఖ ఉన్నతాధికారులు పేర్కొంటున్నారు. ఇలా వాక్ – ఇన్ విధానంలో ఎక్కువగా బ్యాంకు లోన్లకు సంబంధించిన మార్టిగేజ్ డాక్యుమెంట్లు, రిలీజ్ డీడ్‌లు రిజిస్ట్రేషన్ అవుతున్నాయని ఆశాఖ వర్గాలు చెబుతున్నాయి.

రోజుకు 48 స్లాట్లు..

స్లాట్ బుకింగ్ విధానంలో ఒక్కో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రోజుకు 48 స్లాట్లు బుక్ చేసుకునే అవకాశం కల్పించారు. 48కి మించి స్లాట్‌లు బుక్ చేయడానికి వీలు లేదు. అయితే ప్రస్తుతం రియల్ ఎస్టేట్ వ్యాపారం కుదేలవడంతో డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్లు చాలా మట్టుకు పడిపోయాయి. ప్రస్తుతానికి 48 డాక్యుమెంట్లకు మించి అవసరం పడటం లేదని ఆశాఖ వర్గాలు చెబుతున్నాయి. అయితే ప్రభుత్వం జూన్ 2 నుంచి అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ స్లాట్ విధానాన్ని అమలు చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి.

మంచి ఫలితాలనిస్తోంది



ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం సదాశివపేట, గజ్వేల్, సిద్దిపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ స్లాట్ బుకింగ్ విధానం అమలవుతోంది. అయితే ఈ విధానం మంచి ఫలితాలినిస్తోంది. రిజిస్ట్రేషన్ ప్రక్రియ తొందరగా జరుగుతోంది. దీంతో రిజిస్ట్రేషన్ కోసం వచ్చే వారికి ఎంతో సౌకర్యంగా ఉంటోంది. స్లాట్‌లో పేర్కొన్న నిర్ణీత సమయానికి వచ్చి రిజిస్ట్రేషన్ చేసుకుని వెళుతున్నారు. లైన్లో నిలబడటం, గంటల తరబడి వేచి ఉండటం వంటి తిప్పలు తప్పుతున్నాయి.

–ఐ.వి.సుబ్బలక్ష్మి, జిల్లా రిజిస్ట్రార్, ఉమ్మడి మెదక్ జిల్లా



సమావేశంలో ఉన్నతాధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ క్రాంతి

భూ సేకరణ పనులు వేగవంతం

అధికారుల సమీక్షలో కలెక్టర్ క్రాంతి

సంగారెడ్డి జోన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రీజనల్ రింగ్ రోడ్డు (ట్రిపుల్ ఆర్), నిమ్జ్‌కు సంబంధించిన భూ సేకరణ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో భూసేకరణపై మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఇప్పటివరకు సేకరించిన భూ వివరాలతో పాటు సేకరించాల్సిన వాటిపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జహీరాబాద్‌లోని నిమ్జ్ కోసం సేకరించిన 7,500 ఎకరాల భూమికి రక్షణ కంచెను ఏర్పాటు చేయాలని సూచించారు. మిగతా భూమితోపాటు రీజనల్ రింగ్ రోడ్డు కోసం గుర్తించిన భూముల సేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. నిమ్జ్ పూర్తయితే స్థానికంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. ట్రిపుల్ ఆర్ పూర్తయితే రవాణా సులభతరంతోపాటు విద్య, వాణిజ్య, వ్యాపార రంగాలలో అభివృద్ధి జరుగుతుందన్నారు. భూ సేకరణపై ప్రజలు, రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రాజెక్టు పూర్తయ్యేందుకు అన్ని శాఖల అధికారులు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు మాధురి, చంద్రశేఖర్, నిమ్జ్ ప్రత్యేక అధికారి రాజు, ఆర్డీఓలు రాంరెడ్డి, రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పశువుల అక్రమ రవాణాపై నిఘా

ఎస్పీ పరితోశ్ పంకజ్

సంగారెడ్డి : పశువుల అక్రమ రవాణాపై నిఘా పెంచడంతోపాటు దానిని అరికట్టాలని ఎస్పీ పరితోశ్ పంకజ్ అధికారులకు ఆదేశించారు. గోవుల/ పశువుల అక్రమ రవాణాను నియంత్రిస్తూ జిల్లా సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్‌లను ఎస్పీ పరితోశ్ పంకజ్ మంగళవారం సాయంత్రం తనిఖీ చేశారు. బక్రీద్ పండుగ సందర్భంగా పశువుల అక్రమ రవాణా జరగకుండా జిల్లా సరిహద్దు ప్రాంతాలైన కంది, ముత్తంగి చెక్‌పోస్ట్‌లను సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు.



చెక్‌పోస్ట్ సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ పరితోశ్ పంకజ్

మూడురెట్లు పరిహారం ఇవ్వాలి

సీఎం రేవంత్‌రెడ్డి.. రూ.15 లక్షలకే నీ ఎకరం భూమిస్తవా?



కలెక్టరేట్ వద్ద సీపీఎం నాయకులతో కలసి ధర్నా చేస్తున్న జాన్‌వెస్లీ

- లగచర్ల రైతులకొక న్యాయం.. నిమ్జ్ బాధితులకు మరో న్యాయమా?
- కలెక్టరేట్ ఎదుట ధర్నాలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

సంగారెడ్డి ఎడ్యుకేషన్: నిమ్జ్ రైతులకు 2013 చట్టం ప్రకారం మార్కెట్ ధరపై మూడింతలు అదనంగా నష్టపరిహారం ఇవ్వడంతో పాటు ప్రతీ ఎకరాకు 120 గజాల ప్లాట్‌ను ఇవ్వాలని, లేని పక్షంలో పారిశ్రామికవేత్తలనే కాదు స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి వచ్చినా నిమ్జ్ భూముల్లో అడుగు పెట్టనివ్వబోమని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ హెచ్చరించారు. నిమ్జ్ ప్రాజెక్టు పేరిట వేలాది ఎకరాల భూములను కోల్పోయిన బాధితులకు చట్ట ప్రకారం పరిహారం రూ.కోటిన్నర , 120 గజాల ప్లాట్స్, వ్యవసాయ కూలీలు, వృత్తిదారులకు పునరావాసం కల్పించాలని కోరుతూ సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా కార్యక్రమానికి ముందు స్థానిక పీఎస్‌ఆర్ గార్డెన్ నుంచి వేలాదిమందితో కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం జాన్ వెస్లీ మాట్లాడుతూ...జహీరాబాద్ ప్రాంతంలో ఎకరం భూమి ధర రూ.50 లక్షలకు పైనే పలుకుతోందని, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం నిమ్జ్ కోసం తీసుకుంటున్న భూములకు ఎకరాలకు రూ.15 లక్షల పరిహారమే ఇస్తుందన్నారు. తన ఎకరం భూమిని సీఎం రేవంత్‌రెడ్డి ఇదే రేటుకు ఇచ్చేవారా అని ప్రశ్నించారు. అనంతరం కలెక్టరేట్ ఏఓకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మాణిక్యం, సాయిలు, నర్సింహులు, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



రమేశ్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

యువతకు స్ఫూర్తిదాయకం రమేశ్

ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: కంటి చూపు లేకపోయినా డిగ్రీతో పాటు మూడు కంప్యూటర్ కోర్సులు పూర్తిచేసిన దివ్యాంగుడు రమేశ్ నేటి యువతకు స్ఫూర్తిదాయకంగా నిలిచాడని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వ ఉద్యోగం సాధించేలా శిక్షణ ఇప్పించడం తోపాటు.. తాత్కాలికంగా ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం రమేశ్ ఎమ్మెల్యే గూడెంను కలసి కృతజ్ఞతలు తెలిపారు.

చిన్నప్పుడే చూపు కోల్పోయి...

పటాన్‌చెరు పట్టణానికి చెందిన రమేశ్ తొమ్మిదవ తరగతి చదివే సమయంలో కంటిచూపు కోల్పోయాడు. దీంతో తీవ్ర నిరాశ నిస్పృహలకు లోనయ్యారు. ఈ నేపథ్యంలో రమేశ్ పరిస్థితిని తెలుసుకొన్న స్థానిక రైల్వే ఉద్యోగి..మైత్రి క్రికెట్ అధ్యక్షుడు హనుమంత్‌రెడ్డి, ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి సహకారంతో వెన్నంటి నిలిచారు. పదవ తరగతితోపాటు పటాన్‌చెరు పట్టణంలోని డాక్టర్ అబ్దుల్ కలాం డిగ్రీ కళాశాలలో ఓపెన్‌లో డిగ్రీ చదివించారు. రైల్వే డిపార్ట్‌మెంట్‌లో అందరి ఉద్యోగుల సహకారంతో వివిధ కంప్యూటర్ కోర్సులు పూర్తిచేసేలా కృషి చేశారు. అనంతరం ఎమ్మెల్యే గూడెం సహకారంతో..దివ్యాంగుల కోటాలో ప్రభుత్వ డబుల్ బెడ్‌రూమ్ ఇంటితోపాటు..ప్రభుత్వ పింఛను అందించారు.

ఖేడ్‌లో కుండపోత వర్షం

నారాయణఖేడ్/కల్హేర్(నారాయణఖేడ్) : నారాయణఖేడ్ ప్రాంతంలో మంగళవారం సాయంత్రం కుండపోత వర్షం కురిసింది. ఉదయం నుంచి వాతావరణంలో మార్పులు చోటు చేసుకోవడంతో సాయంత్రం సమయంలో ఖేడ్‌తోపాటు కల్హేర్, సిర్గాపూర్ మండలాల్లో భారీ వర్షం కురిసింది. కల్హేర్, మార్డి, బీబీపేట్, కృష్ణాపూర్, బోక్కస్‌గాం, నల్లవాగు, తదితర చోట్ల కూడా కుండపోత వర్షం పడింది. వర్షం వల్ల జనజీవనం స్తంభించింది. ఖేడ్ పట్టణంలో రహదారులపైనుంచి వరదనీరు భారీగా ప్రవహించడంతో వాహనాల రాకపోకలకు కొద్దిసేపు అంతరాయం ఏర్పడింది. నాగల్‌గిద్ద మండలంలో 49 మి.మీ, మనూరులో 48.3, నారాయణఖేడ్‌లో 43.3మి.మీ వర్షం కురిసింది



నారాయణఖేడ్: పట్టణంలో కురుస్తున్న వర్షం

అలరించిన జావెద్ అక్తార్ కవితాగానం

అంతర్జాతీయ సంగీత సదస్సులో పాల్గొన్న పద్మభూషణ్ అవార్డు గ్రహీత

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: హైదరాబాద్ ఐఐటీలో ఎస్‌పీఐసీ ఎంఏసీఏవై (సొసైటీ ఫర్ ది ప్రమోషన్ ఆఫ్ ఇండియన్ క్లాసికల్ మ్యూజిక్ అండ్ కల్చరల్ అమాంగెస్ట్ యూత్) ఆధ్వర్యంలో కొనసాగుతున్న 10వ అంతర్జాతీయ సాంస్కృతిక, సంగీత సదస్సులో రెండో రోజు మంగళవారం పద్మభూషణ్ అవార్డు గ్రహీత, ప్రముఖ కవి, గేయ రచయిత జావెద్ అక్తార్ కవితాగానం అలరించింది. అక్తార్ అనువాద సంకలనం 'ఇన్ అదర్ వర్డ్స్'లోని 'వోహ్ కమ్రాహ్ యాద్ ఆతా హై..'అనే కవిత ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. పాత ఇంటితో ముడిపడి ఉన్న జ్ఞాపకాలను కవితలో వివరించిన క్రమం ఆహుతుల్ని భావోద్వేగానికి గురి చేసింది. ఎస్‌పీఐసీ ఎంఏసీఏవై వలంటీర్ రష్మిమాలిక్ నేతృత్వంలో జరిగిన ఈ సెషన్‌లో లౌకికవాదం, కళాత్మక బాధ్యత, దేశ నాగరికత తదితర అంశాలపై చర్చ జరిగింది. కార్యక్రమంలో ఎస్‌పీఐసీ ఎంఏసీఏవై జాతీయ చైర్మన్ రాధామోహన్‌తివారీ, ఐఐటీహెచ్ డైరెక్టర్ ప్రొఫెసర్ బీఎస్.మూర్తి, విద్యార్థులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న పద్మభూషణ్ అవార్డు గ్రహీత జావెద్ అక్తార్

క్లుప్తంగా

స్కూటీని తప్పించబోయి..

చెట్టును ఢీకొన్న కారు



దెబ్బతిన్న కారు

కౌడిపల్లి(నర్సాపూర్): స్కూటీని తప్పించబోయి కారు చెట్టును ఢీకొట్టింది. ఈ ఘటన మంగళవారం మండలంలోని రాయిలాపూర్ గేట్ సమీపంలోని పెట్రోల్‌బంక్ వద్ద జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి కారులో మెదక్ వైపు వస్తున్నాడు. ముందు స్కూటీపై వెళ్తున్న అకస్మాత్తుగా వాహనాన్ని పెట్రోల్ బంక్ వైపు తిప్పాడు. వెనుక వస్తున్న కారు స్కూటీని తప్పించే క్రమంలో రోడ్డు పక్కన చెట్టును ఢీకొట్టింది. స్కూటీపైనున్న వ్యక్తి సైతం కిందపడగా గాయాలు అయ్యాయి. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు రాలేదని ఎస్ఐ రంజిత్‌రెడ్డి తెలిపారు.

ఎండు గంజాయి పట్టివేత

రెండున్నర కిలోలు స్వాధీనం



నిందితుడిని పట్టుకున్న అధికారులు

నారాయణఖేడ్: అక్రమంగా తరలిస్తున్న ఎండు గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. జిల్లా ఎక్సైజ్ అధికారి నవీన్ చంద్ర ఆదేశాలతో జిల్లా ఎక్సైజ్ టాస్క్ ఫోర్సు టీమ్‌లోని ఎస్ఐలు హనుమంతు, అనుదీప్, సిబ్బంది అంజిరెడ్డి, అరుణజ్యోతి, రాజేశ్, సాయి సోమవారం రాత్రి ఖేడ్ పట్టణంలోని బసవేశ్వర చౌరస్తా సమీపంలో వాహనాల తనిఖీలు చేపట్టారు. నాగల్‌గిద్దకు చెందిన శివ కుమార్ (35) బైక్‌పై బీదర్ నుంచి వస్తుండగా ఆపి తనిఖీ చేశారు. అతడి వద్ద రెండు సంచుల్లో రెండున్నర కిలోల ఎండు గంజాయి లభ్యమైంది. బీదర్‌లో కొనుగోలు చేసి తీసుకొస్తున్నట్లు నిందితుడు ఒప్పుకోగా అరెస్టు చేసి ద్విచక్రవాహనాన్ని సీజ్ చేశారు. తదుపరి దర్యాప్తు నిమిత్తం ఖేడ్ ఎక్సైజ్ సీఐ కార్యాలయంలో అప్పగించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ



వివరాలు సేకరిస్తున్న పోలీసులు

దుబ్బాకరూరల్: తాళం వేసిన ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడిన ఘటన మండలంలోని గోసాన్‌పల్లి గ్రామంలో చోటు చేసుకుంది. ప్రొహిబిషన్ ఎస్ఐ అరుణ్ కథనం మేరకు.. కొమ్ము స్వామి అనే వ్యక్తి గ్రామంలో చిన్నపాటి కిరాణా దుకాణం నడుపుకోవడానికి గదిని నిర్మించుకున్నాడు. కుటుంబ సభ్యులతో అదే గ్రామంలో డబుల్ బెడ్రూం ఇంటిలో నివాసముంటున్నాడు. సోమవారం ఇంటికి తాళం వేసి కిరాణం కోసం నిర్మించుకున్న గదిలో కుటుంబ సభ్యులతో కలిసి నిద్రించాడు. మంగళవారం ఉదయం డబుల్ బెడ్రూం ఇంటికి వెళ్లి చూసేసరికి తాళం పగులగొట్టి ఉంది. లోనికి వెళ్లి చూడగా ముప్పావు తులం బంగారం, 15 తులాల వెండి వస్తువులు అపహరణకు గురయ్యాయి. క్లూస్ టీమ్ వారు వేలి ముద్రలు సేకరించారు. బాధితుడు స్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పీఎస్ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

శివ్వంపేట(నర్సాపూర్): విద్యుదాఘాతంతో గేదె మృతి చెందిన ఘటన మండల పరిధి గూడూర్ గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన ఇబ్రహీం పాడి గేదెలతో ఉపాధి పొందుతున్నాడు. రోజువారి గేదెలను పొలం వద్ద కట్టేసి ఉంచాడు. పైనుంచి వెళ్లిన విద్యుత్ లైన్ వైరు తెగిపడి పాడిగేదెపై పడింది. దీంతో విద్యుదాఘాతానికి గురై మృత్యువాత పడింది. గేదె విలువ రూ.లక్ష 50 వేలు ఉంటుందని బాధిత రైతు వాపోయాడు.

సర్కారు బడి.. పిలుస్తోంది..



సుశిక్షితులైన ఉపాధ్యాయులతో విద్యాబోధన

- విద్యార్థులకు అన్నీ ఉచితమే
- ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు
- బడిబాట కార్యక్రమం ద్వారా అవగాహన
- జిల్లాలో 902 ప్రభుత్వ పాఠశాలలు

గ్రామీణ ప్రాంతాల్లో పేద, మధ్య తరగతి కుటుంబాల తల్లిదండ్రులు తమ పిల్లలకు నాణ్యమైన విద్య అందించాలని చూస్తారు. ఉన్నతంగా చదివించి ప్రభుత్వ ఉద్యోగం సాధిస్తే చూడాలన్నది వారి కల. ఇందుకోసం పిల్లలను ఏ పాఠశాలలో చేర్పించాలి.. నాణ్యమైన విద్య అందుతుందా లేదా అనేది చూస్తుంటారు. ఈ క్రమంలోనే రాష్ట్ర ప్రభుత్వం సర్కారు బడుల్లో మెరుగైన విద్య అందించడానికి పెద్ద ఎత్తున కార్యాచరణ చేపట్టింది. అన్ని రకాల వసతులు కల్పించడానికి పూనుకుంది. ఉపాధ్యాయులతో బడి బాట కార్యక్రమం చేపట్టి వసతులపై తల్లిదండ్రులు, విద్యార్థులకు అవగాహన కల్పించి ప్రభుత్వ పాఠశాలల్లోనే చేరే విధంగా చూస్తుంది. ఈ విద్యా సంవత్సరం నుంచి పాఠశాల స్థాయిలోనే సాంకేతికతను జోడించి ఏఐ టెక్నాలజీతో విద్యా బోధన చేపట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంది.

– తూప్రాన్

ఇంగ్లిష్ మీడియం

సమర్థులైన సుశిక్షితులైన బోధనా సిబ్బంది మాత్రమే పాఠాలు బోధిస్తారు. మారుతున్న బోధన, అభ్యసన విధానాలకు అనుగుణంగా ఉపాధ్యాయులకు ప్రభుత్వం శిక్షణ ఇస్తోంది. ప్రభుత్వం సక్సెస్ పాఠశాలల పేరిట ఇంగ్లిష్ మీడియం తరగతులను ప్రారంభించారు. ముందుగానే ఉపాధ్యాయులకు శిక్షణ ఇప్పించి 6 నుంచి 10వ తరగతి వరకు తెలుగు, ఇంగ్లిష్ మీడియం సెక్షన్లను విజయవంతంగా నిర్వహిస్తున్నారు.

క్రీడలకు ప్రాధాన్యం

ప్రైవేట్ స్కూళ్లతో పోలిస్తే ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడలకు తగిన ప్రాధాన్యత ఉంటుంది. ప్రభుత్వ పాఠశాలలకు విశాలమైన మైదానాలు, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడా పరికరాలు ఉండటంతో విద్యార్థులకు క్రీడల్లో నైపుణ్యం సాధిస్తున్నారు. క్రీడల్లో ప్రతిభ చూపితే రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం ఉంటుంది.



బడిబాట కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

జిల్లాలో ప్రాథమిక పాఠశాలలు 628, ప్రాథమికోన్నత 128, జెడ్పీహెచ్ఎస్‌లు 146 ఉన్నాయి. వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేట్‌లో చేర్పించాలా.. ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలా అన్న సందిగ్ధంలో పడిపోతున్నారు. కొందరైతే ప్రైవేట్‌లో అన్ని రకాల మౌలిక వసతులు ఉంటాయని అటువైపు మొగ్గు చూపుతున్నారు. విద్యార్థులను ఆకట్టుకునేందుకు ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు సైతం ప్రచారాలు హోరెత్తిస్తున్నాయి. ఈ క్రమంలోనే విద్యార్థులు సర్కారు బడిలో చేరే విధంగా ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రణాళిక రచిస్తుంది. పాఠశాలల్లో ప్రభుత్వం కల్పిస్తున్న వసతులు గురించి గ్రామాల్లో ఉపాధ్యాయులు ర్యాలీలు నిర్వహించి వివరిస్తున్నారు. సర్కారు బడిని వదిలి కార్పొరేట్ వైపు నడక మంచిది కాదని విద్యా వేత్తలు అంటున్నారు. ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేట్‌కు దీటుగా ఫలితాలు సాధిస్తున్నాయి.

నాణ్యమైన విద్య అందిస్తున్నాం



ప్రభుత్వం నాణ్యమైన విద్యను అందించాలన్నదే లక్ష్యం. ఎంఈఓలకు సైతం బోధనపై శిక్షణ ఇచ్చాం. పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్‌లు సైతం ఈ విద్యా సంవత్సరం అందిస్తున్నాం. ఇప్పటికే ఆయా మండలాలకు చేరాయి. అలాగే ప్రాథమిక స్థాయిలో ఏఐతో విద్యాబోధన అందిస్తున్నాం. జిల్లాతో ఉత్తమ ఫలితాలతో ఉత్తీర్ణత సాధించాం. పాఠశాలల్లో చేర్పించేందుకు బడిబాట కార్యక్రమం నిర్వహిస్తున్నాం.

– రాధాకిషన్, జిల్లా విద్యాధికారి, మెదక్

మధ్యాహ్న భోజనం, యూనిఫామ్‌లు

పేద విద్యార్థులు రోజూ బడికి వచ్చేలా తీసుకునే చర్యల్లో భాగంగా ప్రభుత్వం అన్ని సర్కారు బడుల్లో సన్నబియ్యంతో మధ్యాహ్నభోజన పథకం అమలు చేస్తోంది. ఈ పథకం అమలు ద్వారా విద్యార్థులు ఇంటి నుంచి భోజనం తెచ్చుకునే బాధ తప్పింది. 1 నుంచి 8 వతరగతి విద్యార్థులకు యేటా రెండు జతల యూనిఫామ్‌లను అందిస్తోంది. అలాగే ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు ప్రభుత్వం ఉపకార వేతనాలు అందిస్తోంది. పాఠశాల ఇంటికి మూడు కిలోమీటర్ల పైన దూరం ఉండి ఎలాంటి రవాణా సౌకర్యం లేకపోతే 6, 7, 8వ తరగతి విద్యార్థులకు నెలకు రూ.250 చొప్పున ప్రభుత్వం రవాణా భత్యం చెల్లిస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్నారు.

పరిశోధనలకు అవకాశం

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పరిశోధనల్లో పాల్గొనే అవకాశాన్ని ప్రభుత్వం కల్పిస్తోంది. జాతీయ, సైన్స్ పరిశోధన అంశాలు ప్రదర్శించేందుకు ఇన్‌స్పైర్ అవార్డుల పథకంలో పాఠశాల స్థాయి నుంచే ప్రోత్సాహకాలను అందిస్తోంది. ఇందులో భాగంగా ప్రతీ పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థులకు రూ.5 వేల చొప్పున సాయం అందిస్తారు. ఇది కాకుండా పాఠశాల తరపున వైజ్ఞానిక ప్రదర్శనల్లో పాల్గొనేందుకు విద్యార్థులకు విద్యాశాఖ ప్రోత్సహిస్తోంది.

ఐపీఎల్ బెట్టింగ్ గుట్టు రట్టు

- ఫామ్ హౌస్ పై పోలీసుల దాడులు
- 9 మందిపై కేసు నమోదు
- ఐదు కార్లు, ఫోన్లు, టీవీ, నగదు స్వాధీనం



పోలీసుల అదుపులో నిందితులు

హత్నూర(సంగారెడ్డి): ఐపీఎల్ క్రికెట్‌ను టీవీలో చూస్తూ బెట్టింగ్‌కి పాల్పడుతున్న 9 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఘటన హత్నూర మండలం మల్కాపూర్ గ్రామ శివారులోని వీఎస్ఆర్ ఫామ్‌హౌస్ లో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. హత్నూర ఎస్ఐ శ్రీధర్ రెడ్డి కథనం మేరకు.. క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్నట్లు నమ్మదగిన సమాచారం మేరకు వీఎస్ఆర్ ఫామ్‌హౌస్‌పై దాడులు చేశాం. అక్కడ కొందరు పంజాబ్, ముంబై క్రికెట్ మ్యాచ్‌పై త్రో ఏపీకే లింక్ హోమ్ సైట్‌లో డబ్బులు పెట్టి బెట్టింగ్‌కు పాల్పడుతున్నారు. అక్కడ ఉన్న 9 మందిని అందులోకి తీసుకొని వారి వద్ద నుంచి 5 కార్లు, 13 సెల్ ఫోన్లు, ల్యాప్ టాప్, టీవీతోపాటు రూ.5,590 నగదును స్వాధీనం చేసుకున్నాం. ఇందులో హైదరాబాద్ మియాపూర్ ప్రాంతానికి చెందిన తుమ్మలి సంగమేశ్వర్, కూకట్‌పల్లికి చెందిన మస్‌పాల్ రాజు, కామారెడ్డి జిల్లా పిట్లం మండలం తిమ్మానగర్ గ్రామానికి చెందిన రేగోడు మణికంఠ, హత్నూర మండలం (కాసాల) దౌల్తాబాద్ పట్టణానికి చెందిన ఆవుల గడ్డ శ్రీనివాస్ రెడ్డి, అల్లాదుర్గం మండలం గడి పెద్దాపూర్ గ్రామానికి చెందిన మటన్ చెన్న కృష్ణా గౌడ్, నర్సాపూర్ పట్టణానికి చెందిన పైడి శ్రీనివాస్, అమీన్‌పూర్ మండలం పటేల్‌గూడ గ్రామానికి చెందిన ఈర్ల భాస్కర్, హత్నూర మండలం కాసాల గ్రామానికి చెందిన మద్దూరి దుర్గయ్య, నూరు మండలం దౌల్తాబాద్ గ్రామానికి చెందిన హసారి శ్రీనివాస్ ఉన్నారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వరకట్నం వేధింపులతో వివాహిత ఆత్మహత్య



శిరీష (ఫైల్)

జగదేవ్‌పూర్(గజ్వేల్): వరకట్నం వేధింపులకు వివాహిత బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఘటన మండలంలోని చాట్లపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ చంద్రమోహన్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన వంశీధర్‌కు జనగామ జిల్లా వెంకిర్యాలకు చెందిన శిరీష(21)ని ఇచ్చి 2021లో వివాహం చేశారు. పెళ్లి సమయంలో మూడున్నర తులాల బంగారం, రూ.2 లక్షల నగదుతోపాటు బైక్ కట్నంగా ఇచ్చారు. ఏడాది తర్వాత పాప తన్విక జన్మించింది. అప్పటి నుంచి భర్త అదనంగా కట్నం తీసుకురావాలని భార్యను ఇబ్బంది పెట్టగా పలుసార్లు శిరీష కుటుంబ సభ్యులు రూ.లక్షన్నరకు పైగా ఇచ్చారు. రెండేళ్ల నుంచి వంశీధర్ ఎలాంటి పని చేయకుండా మద్యానికి బానిసగా మారి మరి కొంత అదనపు కట్నం తేవాలని వేధిస్తూనే ఉన్నాడు. సోమవారం రాత్రి మరోసారి భార్యతో గొడవ పడ్డాడు. దీంతో మనస్తాపానికి గురైన శిరీష అదే రాత్రి బెడ్రూంలో చీరతో ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడింది. శిరీష ఆత్మహత్య చేసుకోలేదని, భర్త, అత్తింటి వారే చంపారని మృతురాలి కుటుంబ సభ్యులు, బంధువులు ఆరోపించారు. మృతురాలి తల్లి రేణుక ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. గజ్వేల్ ఏసీపీ నర్సింలు, సీఐ మహేందర్‌రెడ్డి చాట్లపల్లి గ్రామానికి చేరుకొని ఘటనా స్థలాన్ని, మృతదేహాన్ని పరిశీలించారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి



శ్రీకాంత్ (ఫైల్)

జోగిపేట(అందోల్): ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జోగిపేట ఎస్ఐ పాండు కథనం మేరకు.. జోగిపేటకు చెందిన శ్రీకాంత్ (41) సెలూన్ హౌస్‌లో పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొంత కాలంగా కుటుంబంలో కలహాలు రాగా భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. ఈ ఇంట్లో మంగళవారం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య మంగలి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అప్పుల బాధతో వ్యక్తి



భాస్కర్ (ఫైల్)

కొండపాక(గజ్వేల్): అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుకునూరుపల్లి ఎస్ఐ శ్రీనివాస్ కథనం మేరకు.. మండల పరిధిలోని తిమ్మారెడ్డిపల్లికి చెందిన సున్నపు భాస్కర్ (32) కుటుంబ పోషణతోపాటు ఇతరత్ర అవసరాల నిమిత్తం అప్పులు చేశాడు. అవి తీర్చే మార్గం లేక గ్రామస్తులు, కుటుంబీకులతో చెబుతూ మదన పడుతుండేవాడు. 25న బయట పని ఉందంటూ ఇంట్లో చెప్పి వెళ్లాడు. తిరిగి రాకపోవడంతో బంధువులు, తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. ఈ క్రమంలోనే మంగళవారం గ్రామ శివారులోని ఓ వ్యవసాయ బావిలో మృతదేహమై కనిపించాడు. అటుగా వెళ్లి వారు చూసి గ్రామస్తులు, కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. అప్పుల బాధతో మనస్తాపం చెంది బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

క్షణికావేశంలో ఉరేసుకొని వివాహిత

హుస్నాబాద్‌రూరల్: క్షణికావేశంలో ఉరేసుకొని వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన హుస్నాబాద్ మండలం పందిల్ల గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ మహేశ్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన అల్లెపు సంతోష(27) భార్యాభర్తల మధ్య వచ్చిన చిన్న గొడవకు క్షణికావేశంతో ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యులు చూసి హుస్నాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతురాలికి భర్త మహేశ్, ఇద్దరు పిల్లలు ఉన్నారు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పొదుపుతోనే భవిష్యత్

- ఎంపీ రఘునందన్‌రావు
- వెంకటాయిపల్లిలో పోస్టాఫీసు ప్రారంభం



పోస్టాఫీసును ప్రారంభిస్తున్న రఘునందన్

తూప్రాన్: పోస్టాఫీసులో ప్రతి ఒక్కరూ పొదుపు అలవర్చుకోవాలని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని వెంకటాయిపల్లిలో నూతన కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. పోస్టాఫీసులో పొదుపు చేయడం ద్వారా కుటుంబానికి ఎంతో ఆసరా ఉంటుందని చెప్పారు. అలాగే ప్రమాద బీమాలు చేయడం ద్వారా మేలు జరుగుతుందని తెలిపారు. ఆడపిల్లలు కలిగిన కుటుంబాలు సుకన్య సమృద్ధి ఖాతాలు తెరవాలని సూచించారు. ప్రజలకు ఏ అవసరాలు వచ్చిన అందుబాటులో ఉంటానని ఎంపీ తెలిపారు. పార్టీలకు అతీతంగా సమస్యలు పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం నూతనంగా తెరిచిన ఖాతా పుస్తకాలను ఖాతాదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మెదక్ పోస్టాఫీసు సూపరింటెండెంట్ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు చోట్ల నలుగురు అదృశ్యం


కటింగ్‌కు వెళ్లి విద్యార్థి



మురారి

తొగుట(దుబ్బాక): ఇంటి నుంచి వెళ్లి విద్యార్థి అదృశ్యమైన ఘటన మండలంలోని వెంకట్రావుపేటలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్ఐ రవికాంత్‌రావు కథనం మేరకు.. దౌల్తాబాద్ మండలం శేరుపల్లి గ్రామానికి చెందిన నేరేండ్ల రజిత, హన్మగౌడ్‌కు కుమారుడు, కూతురు ఉన్నారు. కుమారుడు మురారి గౌడ్ సిద్దిపేట ఇందూరు ఇంజనీరింగ్ కాలేజీలో ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. వారం కిందట అమ్మమ్మ ఊరైన వెంకట్రావుపేటకు వచ్చాడు. 26న సాయంత్రం కటింగ్ చేయించుకుంటానని ఇంట్లో చెప్పి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఎక్కడ వెతికినా ఆచూకీ లభించకపోవడంతో మంగళవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

షాపు కోసం వెళ్లి..



నాగమణి

నర్సాపూర్ రూరల్: యువతి అదృశ్యమైన ఘటన మండలంలోని బ్రాహ్మణపల్లిలో చోటు చేసుకుంది. నర్సాపూర్ ఎస్ఐ లింగం కథనం మేరకు.. బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన గుండని నాగమణి(20) నెల రోజుల కిందటి వరకు నర్సాపూర్‌లోని ఓ స్టీల్ షాపులో పని చేసి మానేసింది. 26న అదే షాపునకు వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి బయటికి వెళ్లింది. సాయంత్రం వరకు తిరిగి రాకపోవడంతో తండ్రి గుండని యాదయ్య ఇతర కుటుంబ సభ్యులు కలసి నర్సాపూర్‌తోపాటు బంధువుల వద్ద వెతికినా జాడ తెలియరాలేదు. మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. నాగమణి ఆచూకీ తెలిస్తే ఎస్ఐ లింగం 8712657941, సీఐ జాన్ రెడ్డి 8712657940 నంబర్లకు ఫోన్ చేయాలని కోరారు.

కూతురితో కలిసి తల్లి



తల్లి మమత



కూతురు తనుశ్రీ

శివ్వంపేట(నర్సాపూర్): తల్లీ కూతురు అదృశ్యమైన ఘటన మండల పరిధి శభాష్‌పల్లి గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన కోట్ల రాజు కూతురు మమతను రాయపోల్ మండలం వడ్డేపల్లికి చెందిన వ్యక్తితో వివాహం జరిపించారు. 20న తల్లిగారి ఊరైన శభాష్‌పల్లి నుంచి అత్తగారి ఊరైన వడ్డేపల్లికి రెండేళ్ల కూతురు తనుశ్రీతో కలిసి మమత బయలుదేరింది. తల్లీకూతురు వడ్డేపల్లికి రాకపోవడంతో ఆందోళన చెందిన ఇరు కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. మంగళవారం మమత తండ్రి రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మధుకర్‌రెడ్డి తెలిపారు.

31న అనుబంధ సంఘాల జాతీయ కార్యవర్గ సదస్సు

మెదక్ మున్సిపాలిటీ: ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల జాతీయ కార్యవర్గ సదస్సును 31 నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు చెట్లపల్లి యాదగిరి తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రమైన మెదక్ ఐబీ గెస్ట్ హౌస్‌లో ఎమ్మార్పీఎస్ ముఖ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రపతి చేతుల మీదుగా మందకృష్ణ మాదిగ పద్మశ్రీ అవార్డు తీసుకొని వరంగల్‌కు వస్తున్న సందర్భంగా ఘన స్వాగతం పలకాలని తెలిపారు. వరంగల్‌లో జాతీయ కార్యవర్గ సదస్సు నిర్వహించ తలపెట్టినందున గ్రామ గ్రామం నుంచి ఎమ్మార్పీఎస్ అనుబంధ సామాజిక సంఘాల నాయకులు తరలిరావాలని పిలుపునిచ్చారు.

ద్విచక్ర వాహనం దహనం

సిద్దిపేటకమాన్: ఇంటి ఎదుట పార్క్ చేసిన ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు దహనం చేశారు. ఈ ఘటన సిద్దిపేట పట్టణంలో చోటు చేసుకుంది. సిద్దిపేట వన్ టౌన్ సీఐ వాసుదేవరావు కథనం మేరకు.. పట్టణంలోని ఎన్‌జీవోస్ కాలనీకి చెందిన కోటి భవన నిర్మాణ కార్మికుడిగా పని చేస్తున్నాడు. రోజు మాదిరిగానే ద్విచక్ర వాహనాన్ని ఇంటి ఎదుట పార్క్ చేశాడు. అర్ధరాత్రి ద్విచక్ర వాహనంకు మంటలు అంటుకున్నట్లు గుర్తించిన అతడి కూతురు విషయాన్ని తండ్రికి చెప్పింది. వెంటనే నీళ్లు చల్లి మంటలార్పేశారు. గుర్తు తెలియని వ్యక్తులు బైక్‌ను దహనం చేసినట్లు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

హక్కుల సాధనకు చలో ఖమ్మం

నారాయణఖేడ్: గిరిజన హక్కుల సాధన కోసం జూన్ 8న నిర్వహించనున్న 'చలో ఖమ్మం'కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని లంబాడీ హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు దాస్‌రాంనాయక్, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ప్రకాష్ రాథోడ్ పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఖేడ్‌లో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన కులగణనలో లంబాడీల జనాభాను బహిర్గతం చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం గోర్‌బోలి భాషను అధికారికంగా గుర్తించి రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. రిజర్వేషన్లను 14 శాతానికి పెంచాలని, పోడు భూములకు పట్టాలు ఇచ్చి సేవాలాల్ జయంతి రోజును సెలవుదినంగా ప్రకటించాలని కోరారు. తండా పంచాయతీలను రెవెన్యూ పంచాయతీలుగా గుర్తించాలన్నారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సురేశ్ నాయక్, నాయకులు రాంజీ, ప్రవీణ్, రాజు, నరేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఆగిన ఉన్న లారీని ఢీకొట్టిన కంటైనర్

ఒకరు మృతి, మరొకరికి గాయాలలు

జిన్నారం (పటాన్‌చెరు): ఔటర్‌రింగ్ రోడ్డుపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. సీఐ రవీందర్ రెడ్డి కథనం మేరకు.. ఔటర్‌రింగ్ రోడ్డుపై ఆగి ఉన్న లారీని వెనుక నుంచి అతివేగంగా వచ్చిన కంటైనర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆగి ఉన్న లారీ టైర్ విప్పుతున్న క్లీనర్ హిజాజ్ (36) తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. లారీ డ్రైవర్ ఇగ్బాల్ భగవాన్ గాయాలతో బయటపడ్డాడు. మృతుడి బంధువు ఎస్‌కే అబేద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి

సంగారెడ్డి క్రైమ్: అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటన పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పట్టణ సీఐ రమేశ్ కథనం మేరకు.. కల్హేర్ మండలం దేవునిపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి వృత్తిరీత్యా పట్టణంలో మేస్త్రీ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. పట్టణంలోని కొత్త బస్టాండ్ ఎదురుగా గల వైన్స్‌కి వెళ్లి పర్మిట్ రూమ్‌లో తాగి స్పృహ లేకుండా పడిపోయాడు. చుట్టుపక్కల వారు గమనించి సాయంత్రం ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

నిర్మాణ పనులు చేస్తూ కిందపడి కూలీ

శివ్వంపేట(నర్సాపూర్): ఆలయ నిర్మాణ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడి కూలీ మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధి లింగోజిగూడ తండాలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్ఐ మధుకర్ రెడ్డి కథనం మేరకు.. ఈస్ట్ గోదావరి జిల్లా పెద్దపూరానికి చెందిన శిరం కొండబాబు(50) తండాలో నూతనంగా నిర్మిస్తున్న ఆలయం పనుల్లో కూలీగా పని చేస్తున్నాడు. ఆలయం పైన పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అట్రాసిటీ కేసుపై డీఎస్పీ విచారణ

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని దేవులపల్లిలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు విషయమై తూప్రాన్ డీఎస్పీ నరేందర్‌గౌడ్ మంగళవారం గ్రామంలో విచారణ చేశారు. గ్రామానికి చెందిన జింక వెంకటేశం అతడి అక్క కంసమ్మ సోమవారం ప్రజావాణి ఫిర్యాదు విషయమై విచారణ కోసం వెళ్లిన పంచాయతీ కార్యదర్శి బొమ్మర్తి జ్యోతి, ఎంపీఓ కలీముల్లను కులం పేరుతో దూషించిన విషయం విధితమే. ఇద్దరిపై అట్రాసిటీ కేసు నమోదు కాగా తూప్రాన్ డీఎస్పీ గ్రామానికి వెళ్లి గ్రామస్తులను విచారించారు. అనంతరం కౌడిపల్లి పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు తనిఖీ చేశారు. ఆయన వెంట ఎస్ఐ రంజిత్‌రెడ్డి, పోలీసులు ఉన్నారు.

ధాన్యం కుప్పలను ఢీకొని ఇద్దరు మృతి

- మరొకరికి గాయాలు
- ఉమ్మడి మెదక్ జిల్లాలో ఘటనలు
- మృతుల్లో ఒకరు ఐటీఐ విద్యార్థి



కార్తీక్ (ఫైల్)

శివ్వంపేట(నర్సాపూర్): ధాన్యం కుప్పను ఢీకొని విద్యార్థి మృతి చెందిన ఘటన మెదక్ జిల్లా శివ్వంపేట మండలంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మండల పరిధి పెద్దగొట్టిముక్ల గ్రామానికి చెందిన బాణాపురం కార్తీక్(16) సోమవారం రాత్రి గోమారంలో కూరగాయలు తీసుకురావడానికి బైక్‌పై స్నేహితుడు యశ్వంత్‌తో కలిసి బయలుదేరాడు. చిన్నగొట్టిముక్ల-జీడిపల్లి ప్రధాన రహదారి గోమారం గ్రామ శివారు రోడ్డుపై ఏర్పాటు చేసిన వరి ధాన్యం కుప్పను బైక్‌తో ఢీకొట్టాడు. ధాన్యం కుప్పపై రాళ్లపై కార్తీక్ పడటంతో తీవ్ర గాయాలు అయ్యాయి. విషయం తెలుసుకున్న కుటుంబీకులు వచ్చి నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి, అనంతరం మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. బైక్ వెనుకాల కూర్చున్న యశ్వంత్‌కు గాయాలు కాగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతుడు కార్తీక్ గుమ్మడిదలలో ఐటీఐ మొదటి సంవత్సరం పూర్తి చేశాడు. పద్మ, నరేందర్ దంపతులకు చిన్న వయస్సు గల కూతురితోపాటు ఇప్పుడు కుమారుడు కార్తీక్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో కన్నీటి పర్యంతమయ్యారు. పోలీసులు కేసు నమోదు చేశారు.



ప్రమాదానికి కారణమైన రోడ్డుపై వడ్ల కుప్ప

కొండపోచమ్మ ఆలయ వాచ్‌మెన్



బాల్‌నర్సయ్య (ఫైల్)

జగదేవ్‌పూర్(గజ్వేల్): జగదేవ్‌పూర్ మండలంలోని ఇటిక్యాల గ్రామానికి చెందిన ఎర్రోల్ల బాల్‌నర్సయ్య(53) కొండపోచమ్మ ఆలయం వద్ద వాచ్‌మెన్‌గా పని చేస్తున్నాడు. సోమవారం టీవీఎస్ బైక్‌పై ఇటిక్యాలకు వచ్చాడు. తిరిగి రాత్రి కొండపోచమ్మకు వెళ్తున్నాడు. మునిగడప పెట్రోల్ బంకు సమీపంలో అదుపుతప్పి ధాన్యం కుప్పను ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వైద్యం కోసం గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు.